## క్లుప్తంగా

### ముఖ్యమంత్రి సహాయనిధి సాయం అందజేత



కొవ్వూరులో లబ్ధిదారుకు చెక్కు అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: వైద్య ఖర్చులకు తక్షణ సాయంగా రెండు కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2.70 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత బాధిత కుటుంబాలకు ఆ చెక్కులను అందజేశారు. తాళ్లపూడికి చెందిన నీరుకొండ సూర్యనారాయణకు రూ.70 వేలు, జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన భోగిరెడ్డి స్నేహకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం మంజూరైంది.

### దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



చాగల్లులో ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంఈవో ఖాదర్‌బాబు

చాగల్లు: ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ దివ్యాంగులు ఉన్నత చదువులు చదవాలని ఎంఈవో వి.ఖాదర్‌బాబు అన్నారు. సర్వశిక్షాభియాన్ సమకూర్చిన ట్యాబ్‌లను మంగళవారం మండలంలోని దివ్యాంగ విద్యార్థులకు పంపిణీ చేశారు. చాగల్లు జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వీరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా శ్రీనివాసమూర్తి

చాగల్లు: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా కార్యదర్శిగా మండలానికి చెందిన ఉపాధ్యాయుడు పిల్లి శ్రీనివాసమూర్తి ఎన్నికైనట్టు ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు జె.రాజశేఖర్ మంగళవారం తెలిపారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలో నిర్వహించిన యూటీయఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో శ్రీనివాసమూర్తి జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారన్నారు. యూటీఎఫ్ చాగల్లు మండలం ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసమూర్తి తొమ్మిదేళ్ల పాటు పని చేశారన్నారు.

### డిగ్రీ కళాశాలకు మొక్కల వితరణ



మొక్కలు అందజేస్తున్న కౌన్సిలర్ కొత్తపల్లి సుప్రియ, రోటరీ క్లబ్ సభ్యులు

నిడదవోలు: స్థానిక ఎస్వీఆర్‌కే డిగ్రీ కళాశాల్లో విద్యార్థులకు వృక్షశాస్త్రం బోధనకు అవసరమైన మొక్కలను మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ అందజేసింది. కౌన్సిలర్ కొత్తపల్లి సుప్రియ ఆర్థిక సహకారంతో రోటరీ క్లబ్ ఈ సేవా కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, వేదల విజయలక్ష్మి, కాళ్ళ రాంబాబు, గుంటుపల్లి శివకుమార్, కొత్తపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### టెండర్ల ఆహ్వానం

కొవ్వూరు: నల్లజర్ల ఆర్టీసీ బస్టాండ్ (సి- క్లాస్ )లో స్టాల్స్, దుకాణం, ఖాళీ ప్రదేశంలో అద్దె చెల్లించి వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా టెండర్లను ఆహ్వానిస్తున్నట్టు ఆర్టీసీ కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు బీసీల నుంచి మాత్రమే టెండర్లను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. టెండర్ల కోసం ఈనెల 24 మధ్యాహ్నం ఒంటి గంట లోగా రూ.250తో పాటు జీఎస్టీ చెల్లించి డిపో మేనేజర్ కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చన్నారు. సీలు వేసిన టెండర్లను అదే రోజు మధ్యాహ్నం రెండు గంటలకు డిపో మేనేజర్ కార్యాలయంలో తెరవనున్నట్టు డీఎం తెలిపారు.

### చివటంలో దంపతుల ఆత్మహత్యాయత్నం

ఉండ్రాజవరం: మండలంలోని చివటం గ్రామానికి చెందిన ఆరేపల్లి సత్యనారాయణ, అతడి భార్య నాగలక్ష్మి కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. వివరాలిలా ఉన్నాయి. వ్యవసాయదారుడైన సత్యనారాయణ అదే గ్రామానికి చెందిన పి.వెంకటేశ్వర్లు వద్ద కొంత అప్పు చేశాడు. బాకీ చెల్లించాలని వెంకటేశ్వర్లు రెండు రోజుల క్రితం ఒత్తిడి తేగా, సోమవారం చెల్లిస్తానని సత్యనారాయణ బదులిచ్చాడు. అయితే సత్యనారాయణ ఆదివారం పొలంలో ధాన్యం పట్టుబడి పడుతుండగా వెంకటేశ్వర్లు తన మనుషులతో వచ్చి ధాన్యాన్ని ట్రాక్టర్‌పై తరలించుకుపోయాడు. దాంతో తీవ్ర మనస్తాపం చెందిన సత్యనారాయణ సోమవారం కలుపు మందును తన భార్యకు ఇచ్చి తాను కూడా తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వారిని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. దీనిపై సత్యనారాయణ సోదరుడు ఆరేపల్లి శేషారావు మంగళవారం ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై కె.రామారావు దర్యాప్తు చేస్తున్నారు.

# హామీలు నెరవేర్చాం.. అండగా ఉన్నాం

- మళ్లీ అవకాశం ఇప్పించండి
- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- పలు ప్రాంతాల్లో ఉత్సాహంగా 'వై ఏపీ నీడ్స్ జగన్ ' కార్యక్రమం

నిడదవోలు: ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి అన్ని వర్గాల ప్రజలకూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. అందుకే మళ్లీ గెలిపించాలని కోరుతున్నామన్నారు. కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా వై ఏపీ నీడ్స్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. పట్టణంలోని బసివిరెడ్డి పేట సచివాలయం వద్ద మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభుత్వం నుంచి ప్రజలు పొందిన పథకాల లబ్ధిని వివరిస్తూ రూపొందించిన బోర్డును, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగన్ అధికారం చేపట్టాక ఈ సచివాలయం పరిధిలోని రెండు వార్డుల ప్రజలు రూ.11.77 కోట్ల విలువైన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కమిషనర్ కేవీ పద్మావతి, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగంటి కృపానందం, జిల్లా కార్యదర్శి మద్దిపాటి ఫణీంద్ర, పార్టీ వార్డు ఇన్‌చార్జి అడపా రాజు, కౌన్సిలర్లు మేడపాటి సరితాదేవి, కొత్తపల్లి సుప్రియ, పువ్వల రతీదేవి, ఎండీ షకీరాబేగం, అహ్మదున్నీసాబేగం, ఆలమూరి భారతి, మద్దిపాటి నాగశ్రీ , ఆరుగొళ్ళు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నల్లజర్ల: అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని అవపాడులో సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గత నాలుగున్నరేళ్లలో ఈ సచివాలయం పరిధిలో రూ.16.33 కోట్ల వ్యయంతో అమలైన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్ ప్లే బోర్డును ఆయన సచివాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతికి తావు లేకుండా పూర్తి పారదర్శకంగా పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్ , వైఎస్సార్ సీపీ మండల కన్వీనర గగ్గర శ్రీనివాస్, జేసీఎస్ మండల కన్వీనర కఠారి రాజ్ కుమార్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం గ్రామ సచివాలయం-1 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సమిశ్రగూడెంలో రూ.37.04 కోట్లతో అమలైన సంక్షేమ పథకాలు, రూ.17.95 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన సమాచార బోర్డులను వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన



నిడదవోలు పట్టణంలోని బసివిరెడ్డి పేట సచివాలయం వద్ద సంక్షేమ పథకాల సమాచార బోర్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

పోలయ్య, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ ఆవిష్కరించారు. పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్సార్ సీపీ స్థూపం వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం నాలుగున్నరేళ్లుగా సీఎం జగన్, ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు చేపట్టిన అభివృద్ధిపై సచివాలయ పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించారు. తర్వాత కార్యకర్తలతో కలిసి పార్టీ ప్రధాన నాయకుల ఇళ్ల వద్ద వైఎస్సార్ సీపీ పతాకాలను ఎగురవేశారు. పార్టీ ముఖ్య నాయకులంతా కలిసి సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ నివాసంలో సహపంక్తి భోజనం చేసి పల్లె నిద్ర చేశారు. ఉప సర్పంచ్ గజ్జరపు సరోజిని, ఎంపీటీసీ సభ్యురాలు అంగర ఝాన్సీరాణి, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని అజ్జరం, వెంకట్రాయపురం గ్రామ సచివాలయాల వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.28.21 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. అలాగే అభివృద్ధి పనుల కోసం ఈ రెండు గ్రామాలకు రూ.5.60 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ఇంతటి ఖర్చు గత ప్రభుత్వాల్లో జరిగిందా అని ఎంపీపీ ప్రశ్నించారు. అనంతరం ఎంపీపీ, వైఎస్సార్ సీపీ శ్రేణులు గ్రామంలో ఇంటింటి పర్యటించి జగన్ హయాంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ రామగుడుల సూర్యనారాయణ, సర్పంచ్ గార్లపాటి నాగసుధా భూషణం, ఉప సర్పంచ్ సురేష్ రెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొట్టి రాంబాబు, ఎస్సీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు బీరా రాజు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లిమిల్లి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులతో పాటు గ్రామీణులకు సంక్షేమ పథకాలు కూడా మెరుగ్గా అందాయని జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య అన్నారు. మండలంలోని దమ్మెన్ను సచివాలయం వద్ద సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సంక్షేమ, అభివృద్ధి పనుల వివరాలను తెలిపే బోర్డును భాస్కరరామయ్య ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ పతాకాన్ని సర్పంచ్ గుర్లజర్ల సత్యనారాయణ ఎగుర వేశారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు గ్రామంలో పల్లెనిద్ర చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గెద్దం రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి సిద్ధార్థ రాజు, పాలాటి శరత్‌బాబు, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని కరిచర్లగూడెం సచివాలయం పరిధిలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గత నాలుగున్నరేళ్లలో ప్రజలకు చేకూరిన మేలు గురించి, జరిగిన అభివృద్ధి గురించి ఆ సచివాలయం పరిధిలోని ప్రజలకు వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి ఎస్‌కె వల్లీ, సర్పంచ్ అన్సర్‌బాషా, ఎంపీటీసీ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: మార్కొండపాడు సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రజలకు అందించిన సంక్షేమ వివరాలతో కూడిన సమాచార బోర్డును ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వై ఏపీ నీడ్స్ బుక్ లెట్ లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, సొసైటీ అధ్యక్షుడు గంగిశెట్టి వాసు, పొన్నాడ సింహాద్రి, అయినం నాగరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ ఊబా దుర్గారావు, జాలెం వెంకట్రావు, గంగిశెట్టి చిన్న తదితరులు పాల్గొన్నారు.



సమిశ్రగూడెంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు



అజ్జరంలో ఇంటింటా పర్యటిస్తున్న పెరవలి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ శ్రేణులు



గోపాలపురం మండలం కరిచర్లగూడెం సచివాలయం వద్ద డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణ

### ఈ ఫొటో నా మనవడు జగన్‌ది



వృద్ధురాలు ముస్సెమ్మకు జగన్ ఫొటో చూపుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు

ద్వారకాతిరుమల: 'బామ్మా..! ఈ ఫొటో ఎవరిదో తెలుసా.. గుర్తు పట్టావా..' అని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అడిగిన ప్రశ్నకు ఆ వృద్ధురాలు ఈ విధంగా సమాధానం ఇచ్చింది. 'నాకెందుకు తెలియదు నాయనా.. ఈ ఫొటో నా మనవడు జగన్‌ది, ప్రతి నెలా నాకు ఇంటికి పింఛను పంపిస్తున్నాడు. నేనెలా మరచిపోతాను' అంటూ సంబరంగా బదులిచ్చింది. ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులో ఎమ్మెల్యే తలారి సోమవారం రాత్రి పల్లె నిద్ర చేశారు. మంగళవారం ఉదయం ఆ గ్రామంలో ఇంటింటా పర్యటిస్తూ ముద్దన ముస్సెమ్మ అనే వృద్ధురాలిని ఎమ్మెల్యే పలకరించారు. ఆయన తన వద్ద ఉన్న మా నమ్మకం నువ్వే జగనన్న బ్రోచర్‌పై ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోని ఆమెకు చూపించి, ఇదెవరిది అని అడిగినపుడు ఆ బామ్మ పై విధంగా సమాధానం ఇచ్చింది.

# నవరత్న పథకాలతో నవశకానికి నాంది

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- ఉండ్రాజవరంలో కొనసాగిన గడప గడపకూ..

ఉండ్రాజవరం: ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలు అమలు చేస్తూ నవశకానికి నాంది పలికారని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. ఉండ్రాజవరం పంచాయతీ పరిధిలోని ఆర్‌కే నగర్ కాలనీ, ఎస్సీ ఏరియాలలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్ళి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయా కుటుంబాలకు ఇంతవరకూ



మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

చేకూరిన లబ్ధిని వివరించి బ్రోచర్లు అందజేశారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత పాలనకు గల వ్యత్యాసాన్ని గమనించాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు కోరారు. అనంతరం శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ 2014లో అధికారం చేపట్టిన చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ప్రజలకు 600 హామీలు ఇచ్చి ఆరింటిని కూడా అమలు చేయలేదన్నారు. మహిళా సంఘాలకు రుణమాఫీ చేస్తామని చెప్పి మోసగించారన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, సర్పంచ్ మెండే వెంకట్రావు, వైస్ ఎంపీపీ నరహరశెట్టి సరోజ, ఎంపీటీసీ సభ్యుడు గాడి కృష్ణఫర్, బద్దుల బంగ్రారాజు, తిర్రే ప్రకాష్, చిన్నం సుమన్, మానుకొండ సుందరరావు, మెండే రమేష్, పోట్ల శ్రీను, వెన్నపు వెంకటేష్, గ్రామ బీఎస్సార్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## జల్ జీవన్ అమలులో ఏపీ ముందంజ

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- రెండు గ్రామాల్లో తాగునీటి పనులకు శంకుస్థాపన



పసలపూడిలో తాగునీటి కుళాయిల శిలాఫలాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: జల్‌జీవన్ మిషన్ అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని పసలపూడి గ్రామంలో రూ.55 లక్షలు, సూర్యారావుపాలెం గ్రామంలో రూ.67 లక్షల వ్యయంతో నిర్మించే బోరు, తాగునీటి కుళాయిలు, పైపులైన్ పనులకు ఎమ్మెల్యే మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఉమ్మడి నిధులతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయన్నారు. ప్రతి గ్రామీణ గృహానికీ సురక్షిత తాగునీటిని అందించే లక్ష్యంతో ఈ పథకం సాగుతుందన్నారు. మండలంలో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, పసలపూడి సర్పంచ్ కట్టా లక్ష్మి, రెండు గ్రామాల ఎంపీటీసీ సభ్యురాళ్లు కట్టా విజయలక్ష్మి, పెద ప్రోలు వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు చామర్తి తమ్మిరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవానీ, పిచ్చుకుల రాఘవులు, దుద్దుపూడి కాశీవిశ్వనాథం, కట్టా గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాళ్లపూడిలో అగ్నికుల క్షత్రియ దినోత్సవం



తాళ్లపూడి వద్ద గోదావరి నదిలో పడవలతో ర్యాలీ చేస్తున్న యువకులు

తాళ్లపూడి: ప్రపంచ అగ్నికుల క్షత్రియ దినోత్సవాన్ని మంగళవారం తాళ్లపూడిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అగ్నికుల క్షత్రియ సంఘ యువకులు పలు కార్యక్రమాలు చేపట్టారు. కేక్ కట్ చేశారు. అనంతరం వారు గోదావరి నదిలో పడవలతో ప్రదర్శన చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తాళ్లపూడి మాజీ సర్పంచ్ నామన పరమేశ్వరరావు మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియ సంఘాభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందన్నారు.

# ఆర్యవైశ్యుల్లో సేవాగుణం మిన్న

- హోం మంత్రి తానేటి వనిత
- నందమూరు రోడ్డులో ఘనంగా వన సమారాధన

కొవ్వూరు: ఆర్యవైశ్యుల్లో సేవాగుణం ఎక్కువని, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. పట్టణ శివారు నందమూరు రోడ్డులో మంగళవారం ఆర్యవైశ్యుల కార్తిక వన సమారాధన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ రాజకీయంగాను, వ్యక్తిగతంగానూ ఆర్యవైశ్యులతో తనకు సత్సంబంధాలు ఉన్నాయన్నారు. సామాజిక పరంగా ఐక్యతను చాటడానికి ఇలాంటి వన సమారాధనలు ఉపకరిస్తాయన్నారు. తమ చిరకాల కోరికైన కొవ్వూరులో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ పరంగా స్థలాన్ని కేటాయించాలని ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు మంత్రిని కోరారు. కచ్చితంగా స్థలం కేటాయింపునకు చొరవ తీసుకుంటానని, అనువైన స్థలాన్ని కేటాయించేందుకు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. వన సమారాధనలో



ఆర్యవైశ్యుల కార్తిక వన సమారాధనలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు మంత్రి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఆర్యవైశ్య సంఘాధ్యక్షుడు మద్దుల సోమరాజు, నాయకులు కొల్లేపర శ్రీనివాస్, గ్రంధి శేషగిరిరావు, వలివేటి ప్రసాద్,బంగారు కాశీ అన్నపూర్ణ, మద్దుల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, శ్రీరామా సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలతో ఆర్యవైశులు సాయంత్రం వరకూ సందడిగా గడిపారు.

## క్వారీ తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ

దేవరపల్లి: నల్లరాతి క్వారీల తవ్వకాలకు పర్యావరణ అనుమతుల కోసం మంగళవారం గౌరీపట్నంలోని ఎస్ఆర్ స్టోన్ క్రషర్స్ వద్ద రెవెన్యూ, పర్యావరణ శాఖల అధికారులు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించారు. మండలంలోని దుద్దుకూరు, లక్ష్మీపురం, కొవ్వూరు మండలం దేచర్ల గ్రామ పంచాయతీల పరిధిలో కొత్తగా క్వారీ తవ్వకాల అనుమతుల కోసం ఈ ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. దేచర్ల పంచాయతీ పరిధిలో రెండు, దుద్దుకూరు, లక్ష్మీపురం పంచాయతీల్లో రెండు క్వారీల తవ్వకాలను, ఎర్త్ రోడ్డు మెటల్, బిల్డర్స్‌కు యజమానులు పెట్టుకున్న దరఖాస్తులపై ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహం, పర్యావరణ శాఖ ఈఈ బి.సందీప్‌రెడ్డి, దేవరపల్లి, కొవ్వూరు తహసీల్దార్లు ఎం.రామకృష్ణ, నాయక్ సదస్సులో పాల్గొన్నారు. అభ్యంతరాలు ఉంటే చెప్పాలని ప్రజలను, ప్రజాప్రతినిధులను, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను అధికారులు కోరారు. ఎటువంటి అభ్యంతరాలు రాకపోవడంతో నాలుగు క్వారీలు తవ్వకానికి పర్యావరణ అనుమతులకు వీలుగా ప్రభుత్వానికి నివేదిక పంపిస్తున్నట్టు డీఆర్‌ఓ నరసింహం, పర్యావరణ శాఖ ఈఈ సందీప్‌రెడ్డి తెలిపారు. సదసస్సులో క్వారీ క్రషర్స్ యజమానుల అసోసియేషన్ ప్రతనిధులు పాత్రు సోమేశ్వరరావు, సముద్రారెడ్డి, సూర్యనారాయణరాజు, యజమానులు పాల్గొన్నారు.

### ప్రకటన

నా క్లయింటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ... [illegible] ... కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం.8347/2020 కొవ్వూరు మండలం దాగల్లు ఆర్.యస్.నం.586/4 లో 35 ... [illegible]

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం.బి.ఎల్.
అడ్వకేటు,పాలకొల్లు,సెల్ : 9490433732

## ఉమ్మడి పశ్చిమ బాలికల క్రికెట్ జట్టు ఎంపిక



బాలికల క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలికల జట్టు


దేవరపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్ -17 బాలికల క్రికెట్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ఎంపిక పోటీలు మంగళవారం పల్లంట్ల జెడ్పీ హైస్కూల్లో జరిగాయి. పోటీలను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, సర్పంచ్ నూతలపాటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా జట్టు**

కె. మల్లి, కె.వల్లి (ఇద్దరిదీ తణుకు) ఐ.జాహ్నవీ నాగసాయి, కె.లీలాసాయిప్రసన్న, జి. ధాన్యశ్రీ , ఓరుగంటి సాహితీశ్రీ (నలుగురిదీ దేవరపల్లి), ఎం .సాత్విక (మార్కొండపాడు), జె. మీనా జెస్సీ, ఎ. దీపిక, బి.మధుశాలిని, బి.భవాని, ఎ.నందిని (ఐదుగురిదీ పల్లంట్ల), సీహెచ్ షణ్ముఖప్రియ (యాదవోలు), టి, భవ్యశ్రీ , ఎం. జ్యోతిక (ఇద్దరిదీ కొవ్వూరు) ఎస్.గీతామౌనిక (దుద్దుకూరు), పి. నాగశైలజ(చాగల్లు), రుషిక(తాడేపల్లిగూడెం) ఎంపికయ్యారు. స్టాండ్ బైస్‌గా ఎ.రామలక్ష్మి (పల్లంట్ల), ఎ.రత్నగ్రేసీ (గణపవరం), ఎం.సంజన(యాదవోలు) ఎంపికైనట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డి. రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎంపికైన జట్టు గుంటూరు జిల్లా నర్సరావుపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

## వర్షాలతో రైతుల్లో ఆందోళన

తాళ్లపూడి: వాతావరణ మార్పుల ప్రభావంతో కురుస్తున్న అకాల వర్షం అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మండలంలో మంగళవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. ప్రస్తుతం మండలంలో ఖరీఫ్ వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని చేలల్లో, పుంత రోడ్ల పైనా రాశులుగా పోసి రైతులు బరకాలు కప్పారు. ధాన్యం తడిస్తే



ధాన్యం రాశిపై బరకాలు కప్పిన దృశ్యం

తేమశాతం పెరగడంతో పాటు రంగు కూడా మారుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండ లేకపోవడంతో ధాన్యం రాశుల్లోనే ఉండిపోయింది. మండలంలో రైతులు వరి కోతలను నిలిపివేశారు.

### 24 నుంచి రెండో విడత 'వై ఏపీ నీడ్స్ జగన్'

నిడదవోలు రూరల్: మండలంలోని వివిధ సచివాలయాల పరిధిలో ఈ నెల 24 నుంచి రెండో విడత వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు మంగళవారం తెలిపారు. ఈనెల 24న కోరుపల్లి, 28న మునిపల్లి, 29న పందలపర్రు, 30న పెండ్యాల, డిసెంబర్ 1న పురుషోత్తపల్లి, 4న రావిమెట్ల, 5న సింగవరం, 6న తాడిమళ్ల-1, 7న తాడిమళ్ల-2, 8న తాళ్లపాలెం, 11న తిమ్మరాజుపాలెం, 12న విజ్జేశ్వరం, 13న డి.ముప్పవరం గ్రామాల్లో నిర్వహిస్తామని ఆయన వివరించారు.

## రఘురాజు పాదయాత్రకు వైఎస్సార్ సీపీ స్వాగతం



కాపవరం వద్ద ఎమ్మెల్సీ రఘురాజుకు వైఎస్సార్ సీపీ స్థానిక నాయకుల స్వాగతం

కొవ్వూరు: వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని ప్రార్థిస్తూ విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం బొండవాడ గ్రామం నుంచి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేపట్టిన తిరుమల పాదయాత్ర మంగళవారం కొవ్వూరు చేరుకుంది. వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ నెల 8న చేపట్టిన పాదయాత్ర డిసెంబర్ 21న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు నాడు తిరుమలకు చేరి, మొక్కు చెల్లించుకుంటానని రఘురాజు తెలిపారు. ఎస్.కోట మాజీ ఎంపీపీ ఒంటి అప్పారావు, నాయకులు బొండేడ అప్పారావు, ఆడారి సూరిబాబులతో పాటు నలభై మంది ఆయన వెంట ఉన్నారు.

**గౌరీపట్నంలో..**

దేవరపల్లి: విజయనగరం జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేపట్టిన ఛలో తిరుమల పాదయాత్ర మంగళవారం సాయంత్రం మండలం గౌరీపట్నం చేరుకుంది. రఘురాజుకు గౌరీపట్నం గ్రామ సచివాలయం వద్ద సొసైటీ అధ్యక్షులు గుత్తికొండ అచ్యుతరావు,వైఎస్సార్ సీపీ నాయకులు కొఠారు వెంకటసుబ్బారావు, కుండా వెంకటేశ్వరరావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు స్వాగతం పలికారు.